క్లుప్తంగా

పాదగయ ఈఓగా పులి నారాయణమూర్తి



పాదగయ నూతన ఈఓ పులి నారాయణమూర్తి

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రానికి సహాయ కమిషనర్ హోదా అధికారిని ఈఓగా నియమిస్తూ దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సహాయ కమిషనర్ హోదా కలిగిన ఈఓగా పులి నారాయణమూర్తి పాదగయ ఈఓగా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ ఈఓగా పని చేసిన వి.శ్రీనివాస్‌ను పెద్దాపురం మండలం చిన తిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయ ఈఓగా బదిలీ చేశారు. నూతన ఈఓగా బాధ్యతలు చేపట్టిన పులి నారాయణమూర్తి మాట్లాడుతూ వచ్చే మహా శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

పంచారామ క్షేత్రం ఈఓకు ఏసీగా పదోన్నతి



నాగమల్లేశ్వరరావు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో గ్రేడ్-1 ఈఓ డి.నాగమల్లేశ్వరరావుకు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. రెండు పర్యాయాలు ఆలయంలో ఈఓగా పని చేసిన ఆయన సిబ్బంది, భక్తుల మన్ననలు పొందారు. కోనసీమ జిల్లాలో పోస్టింగ్ వేయడంతో బాధ్యతలు స్వీకరించేందుకు ఆయన శనివారం వెళ్లారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

సామర్లకోట: నవోదయ ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. 9వ తరగతిలో ప్రవేశం కోసం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌ను పరీక్షా కేంద్రంగా ఎంపిక చేశారు. ఈ సెంటర్‌లో 117 మంది హాజరై పరీక్షలు రాసినట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. ప్రభుత్వ హైస్కూల్‌లో జరుగుతున్న ప్రవేశ పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. సెంటర్ లెవెల్ పరిశీలకునిగా వి జగన్‌మోహన్‌రావు వ్యవహరించారు.

సూర్యనారాయణమూర్తి ఆలయంలో పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని సూర్యనారాయణమూర్తి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మాఘమాసం ప్రారంభం సందర్భంగా ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, వేమూరి సోమేశ్వరశర్మ అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

కొత్తపల్లి: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్సై స్వామినాయుడు సూచించారు. మండలంలో ఉప్పాడ, మూలపేట గ్రామాల్లోని ఆటో యూనియన్ సభ్యులకు శనివారం ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో నింబధనలు పాటించకపోవడం వల్లనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అతివేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైఎస్సార్ ఆసరాతో మహిళలకు భరోసా



లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ దొరబాబు

పెద్దాపురం: వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు మరింత ఆర్థిక భరోసా తీసుకువచ్చిందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో భాగంగా మండలంలోని చంద్రమాంపల్లిలో శనివారం వెలుగు ఏపీఎం సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. భవిష్యత్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉన్నామని, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత సీఎం జగన్ చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగో విడత విడుదలైన చెక్కులను దొరబాబు అందజేశారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పీఏసీఎస్ అధ్యక్షులు గోపు నారాయణ మూర్తి, సర్పంచ్‌లు కురిమెళ్ల లోవరాజు, ఒబిలిశెట్టి అబ్బాయి, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, వాసిరెడ్డి శ్రీనివాస్, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో మంచి భవిత

ఏపీఎస్పీ 18వ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ వివేక్



ఎన్‌సీసీ విద్యార్థులతో బెటాలియన్ కల్నల్ తదితరులు

పెద్దాపురం: ఎన్‌సీసీతో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఏపీఎస్పీ 18వ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ వివేక్ సావన్ గురుధర్ అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో శనివారం పెద్దాపురం, హంసవరం, ప్రత్తిపాడులకు చెందిన ఐదు పాఠశాలల నుంచి హాజరైన సుమారు 150 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు ఎన్‌సీసీ 'ఏ' అర్హత పరీక్ష నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సవ్యసాచి దాస్, వివేక్‌లు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి మంచి క్రమశిక్షణతో భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. 18వ బెటాలియన్ సుబేదార్ హేమంత్‌కుమార్, బెటాలియన్ హవల్దార్ మేజర్ రఫీజైన్, కేమ్ రాజ్ తాపా తదితరులు పాల్గొన్నారు.

12,187 మందికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కొత్తపల్లి: నులి పురుగుల నివారణకు గాను మండలంలో 12,187 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ శనివారం తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామన్నారు. సుమారు 90 శాతం మందికి మాత్రలు పంపిణీ చేశామని, మిగిలిన 10 శాతం మందికి ఈ నెల 16న పంపిణీ చేస్తామని తెలిపారు.

కిటకిటలాడిన తొలి తిరుపతి





ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి, స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు

పెద్దాపురం: శృంగార వల్లభస్వామి స్వయంభువుగా వెలసిన తొలి తిరుపతి భక్తులతో కిటకిటలాడింది. మాఘమాసం తొలి శనివారం కావడంతో వేకువజాము నుంచే వేలాదిగా భక్తులు తరలి వచ్చి, గంటల తరబడి క్యూలో వేచి ఉండి మరీ స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు ప్రత్యేక అలంకరణ చేశారు. అన్నదానం, ఇతర విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా స్వామి వారికి రూ.3,88,797 ఆదాయం సమకూరిందని ఈఓ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు ఉచితంగా పులిహోర ప్రసాదంతో పాటు అన్నదానం చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఈఓ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు



ఫాగింగ్ యంత్రాలను ప్రారంభిస్తున్న అధికారులు

పిఠాపురం: పట్టణంలో దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ కనకారావు శనివారం తెలిపారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన ఫాగింగ్ యంత్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో దోమల నివారణకు 15 ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ పట్టణంలోని అన్నివార్డుల పరిధిలో ఈ యంత్రాలతో దోమల నివారణ మందు మందు పిచికారీ చేస్తామన్నారు. దోమల లార్వా దశలోనే నివారించడానికి డ్రైన్లలో గంబూషియా చేపపిల్లలను విడిచిపెడతామన్నారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా పట్టణంలో దోమల బెడద విపరీతంగా పెరిగిందన్నారు. ఈ విషయాన్ని కౌన్సిలర్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి దృష్టికి తీసుకు వచ్చారన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేసి దోమల నివారణకు చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

19 నుంచి వేంకటేశ్వర కల్యాణోత్సవాలు



వేట్లపాలెంలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం

సామర్లకోట: వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు 19 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి మాఘ మాసం ప్రారంభం సందర్భంగా ఏటా భీష్మ ఏకాదశి పర్వదినం రోజున కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. 19న స్వామి అమ్మవార్లను వధూవరులుగా చేసి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 20వ తేదిన భీష్మ ఏకాదశి సందర్భంగా గోపూజ, లక్ష పుష్పాలతో 108 మంది భక్తులచే ప్రత్యేక పూజ, సాయంత్రం శేషవాహన సేవ, రాత్రి కల్యాణం జరుగుతాయన్నారు. పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాసు దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు వాడపల్లి గోపాలచారులు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. 21న సింహ వాహన సేవ, 22న గరుడ వాహన సేవ, సదస్యం, 23న హనుమద్వాహన సేవ, 24న చక్రస్నానం, పూర్ణాహుతి, అనంతరం గజవాహన సేవ, రాత్రి శ్రీ పుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఆలయంలో పూజలు చేయించుకునే భక్తులు 94412 94845న నాగేశ్వరరావును సంప్రదించాలన్నారు.

21 నుంచి జిల్లా స్థాయి భజన పోటీలు

స్వామి వారి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా 21వ తేదీ నుంచి 24వ తేది వరకు స్త్రీ, పురుషులకు విడివిడిగా జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్ర 6 గంటల వరకు భజన పోటీలు ఉంటాయని తెలిపారు. సంగీత పండితులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారన్నారు. ప్రతీ విభాగం నుంచి మూడు బహుమతులు ఉంటాయని తెలిపారు.

ఉరుసు ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



పొన్నాడలో ఉరుసు ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడలో బషీర్‌బీబీ (బంగారు పాప) దర్గా వద్ద నిర్వహించే ఉరుసు ఉత్సవాల ఏర్పాట్లను శనివారం స్థానిక సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 18 వరకూ మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18న జరిగే గంధోత్సవానికి వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆలయం వద్ద, పరిసర ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. కొత్తపల్లి, పిఠాపురం, పిఠాపురం రూరల్, గొల్లప్రోలు మండలాలకు చెందిన సుమారు 100 మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు తమ పిల్లలను జాగ్రత్తగా గమనించుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. దర్గా వద్ద పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్సై స్వామినాయుడు ఉన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

సాక్షి ఇంపాక్ట్



పిఠాపురంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

పిఠాపురం: పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నట్టు పిఠాపురం సీఐ శ్రీనివాస్ శనివారం తెలిపారు. పిఠాపురంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరగడంతో 'జంక్షన్‌లో ట్రాఫిక్ టెన్షన్' అనే శీర్షికతో శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. పట్టణంలోని ప్రధాన సెంటర్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారు. వాహనాలను రోడ్లపై ఇష్టారాజ్యంగా నిలపకుండా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆటోలు, ఇతర వాహనాలను నిర్దేశించిన ప్రదేశంలో పార్కింగ్ చేయాలని సూచించారు.

నిందితులను అరెస్టు చేయాలంటూ ఆందోళన



కొత్తపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న దళితులు

కొత్తపల్లి: మండలంలోని కొత్త మూలపేటలో తండ్రి, కొడుకులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు అధ్యక్షుడు గుబ్బల రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం రాత్రి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఈ నెల 6న మూలపేటకు చెందిన ఆవాల మణికంఠ కొత్తమూలపేటకు చెందిన ధారా ప్రకాష్, అతని తండ్రి ధారా చందులపై చాకుతో దాడిచేసి గాయపరిచాడన్నారు. తీవ్రంగా గాయపడిన వారిద్దరూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో దడాల సుంద్రరావు, చిట్టూమూరి రాంబాబు, నాగభూషణం, వడ్డి నాగమణి, వడ్డి రాజేష్, గెద్దం లక్ష్మణుడు, కాటూరి నాగేశ్వరావు, దడాల విజయ్‌కుమార్, దడాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

పెద్దాపురం: మండలంలోని అన్ని సచివాలయాల్లో నవరత్నాలు–అందరికీ ఇళ్లు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు చురుగ్గా జరుగుతున్నాయని మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అన్నారు. మండలంలోని జి.రాగంపేట, గోరింట గ్రామ సచివాలయాల్లో శనివారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. లబ్ధిదారులు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎన్‌టీఆర్ రమేష్, వీఆర్‌ఓ బాబూరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఏపీపీ కామేశ్వరరావుకు దవులూరి అభినందనలు



దవులూరి దొరబాబును సత్కరించిన దళిత సంఘాల నాయకులు

సామర్లకోట: పెద్దాపురం కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాగం కామేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన దళిత సంఘాల నాయకులతో కలసి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబును శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ అధ్యక్షత వహిస్తూ 175 ఏళ్ల చరిత్రలో జిల్లా సీనియర్ సివిల్ కోర్టులో దళితులకు పదవి రావడం ఆనందంగా ఉన్నదన్నారు. రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు లింగం శివకుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కోర్టులో దళితులు పని చేస్తున్నా సివిల్ కోర్టులో చోటు దక్కలేదన్నారు. ఈ సందర్భంగా కామేశ్వరరావును దొరబాబు, దళిత సంఘ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నేతల హరిబాబు, పాగా సురేష్‌కుమార్, మండల వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ ఇ.అచ్చారావు, దళిత నాయకులు బీపల్లి పండు, కె.అప్పారావు, సల్లూరి కల్యాణ్, పాలిక చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభస్వామి ఆలయ ఈఓగా వడ్డి



తిరుపతి ఆలయ చైర్మన్ జగదీష్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఈఓ శ్రీనివాసరావు

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభ స్వామి ఆలయ ఈఓగా వడ్డి శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఈఓగా కొనసాగిన జిల్లా దేవదాయ శాఖాధికారికి పులి నారాయణమూర్తికి ఇటీవల అసిస్టెంట్ కమిషనర్ హోదా కల్పించగా పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి ఆలయ ఈఓగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో అక్కడ ఈఓగా పనిచేస్తున్న వడ్డి శ్రీనివాసరావును ఇక్కడకు బదిలీ చేశారు. ఆలయ చైర్మన్ కర్ర రామజగదీశ్వరావును ఆయన మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మాఘమాసం తొలి శనివారం కావడంతో ఆలయంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఆలయం వద్ద తొలిరోజు పూర్తి బాధ్యతలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యాపారి మృతి



సీహెచ్ మణికంఠ (ఫైల్)

సామర్లకోట: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఒక కిరాణా వ్యాపారి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం స్థానిక సంపంగితోటకు చెందిన కిరాణా వ్యాపారి సీహెచ్ మణికంఠ (30) అప్పుల బాధ తాళలేక శుక్రవారం సాయంత్రం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీటీసీకి పరామర్శ

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ ఎంపీటీసీ సభ్యుడు మేరుగు యల్లాజీ తండ్రి ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు యల్లాజీని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పొన్నాడ ఉప సర్పంచ్ కారే ఉదయ్‌కిరణ్, అర్జిల్లి నాగరాజు, డొంకా సింహాద్రి, గోగు బుజ్జీ తదితరులు ఉన్నారు.